క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ జాతర

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్, టీటీడీ సహకారంతో నిర్మించిన గంగమ్మ ఆలయంలో మంగళవారం జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హరతి నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కోవెలకుంట్ల: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీకి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని నాల్గవ గ్రామ సచివాలయ పరిధిలో రెండు, మండలంలోని గుళ్లదూర్తిలో ఒక పోస్టు ఖాళీగా ఉండగా 20 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్డీ రాధిక ఆధ్వర్యంలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ

కోవెలకుంట్ల: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాశీంసాహెబ్, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్, జాయింట్ సెక్రటరీలుగా ఓబులేసు, రమేష్‌బాబు, కోశాధికారిగా నాగశేషును ఎన్నుకున్నారు. సీనియర్ న్యాయవాదులు ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, బాలమురళీకృష్ణ, విష్ణుమనోహర్‌రెడ్డి, తిరుపాలు, లక్ష్మిదేవి తదితరులు నూతన కమిటీని ఈ సందర్భంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. విజేతలకు బహుమతులను ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి అందజేశారు. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా పీఆర్ ప్రవీణ్‌కుమార్ జట్టుకు రూ. 30 వేలు, కర్నూలు స్టేడియం జట్టుకు రూ. 20 వేలు, ఆత్మకూరు జట్టుకు రూ. 15 వేలు అందజేశారు. అదేవిధంగా నాలుగు, ఐదు, ఆరవ బహుమతులు వరుసగా నందన చక్రవర్తి జట్టుకు రూ. 10వేలు, వేల్పనూరు టీంకు రూ. 5 వేలు, పాతకోట జట్టుకు రూ. 2 వేలు చొప్పున నగదు అందజేశారు.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. చిరుధాన్యాల వినియోగం, ప్రయోజనాలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సోహేల్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



ఎంపీపీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి, దశల వారీగా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ముస్లింలు గ్రామంలో శ్మశాన వాటికకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని, కంపౌండువాల్ ఏర్పాటు చేయాలని ఎంపీపీకి వినతి పత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు బావికాటి మోహన్‌రెడ్డి, ముస్లిం సోదరులు ఇద్రూస్, నూర్ అహ్మద్, రఫీ, మాబ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

బనగానపల్లెరూరల్: స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో హిందూ సంస్థల ప్రతినిధులు, హిందూ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ శోభకృత్ నామ నూతన సంవత్సర ఉగాది క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. బనగానపల్లె ప్రఖండ కార్యదర్శి జి. ఓబులరెడ్డి, అధ్యక్షుడు వడిసెల రమణరెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయప్రకారం ఉగాది పండుగ నుంచి కొత్త ఏడాది ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కిశోర్‌కుమార్, హిందూబంధువులు చెన్నారెడ్డిగారి నాగిరెడ్డి, కంకరరామచంద్రారెడ్డి, డాక్టర్ రవికుమార్, ఎస్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

మారిన 'పది' పరీక్షల తీరు!

- రెండు పేపర్ల విధానానికి స్వస్తి
- ఇంటర్నల్ మార్కులు, బిట్ పేపర్ ఉండవు
- ప్రతి సబ్జెక్టుకు వంద మార్కులు



కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌లో పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: పదవ తరగతి విద్యార్థులకు తొలి మెట్టుగా భావిస్తుంటారు. పది పరీక్షలు అంటేనే విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు సైతం తీవ్ర వత్తిడికి గురువుతూ ఉంటారు. తమ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడుతుంటారు. ఇక ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకుల తీరు, విద్యార్థుల తీరు వర్ణనాతీతం. మార్చి 3వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు అధికారులు. ఈఏడాది పది పరీక్షల విధానంలో ప్రభుత్వం సమూలమైన మార్పులు తీసుకొచ్చింది. గతంలో హిందీ మినహా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషియల్‌కు సంబంధించి ప్రతి సబ్జెక్ట్‌కు 50 మార్కులు చొప్పున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షకు ఒక రోజున చొప్పున మొత్తం 11 రోజుల పాటు పరీక్షలు జరుగుతుండేవి. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 11 పేపర్ల విధానానికి స్వస్తి పలికి ఆరు పేపర్లతో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2021–22లో ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహించగా ఈఏడాది ఆరు పేపర్లకు కుదించారు. ఇంటర్నల్ మార్కులు, బిట్ పేపర్ ఉండదు. సైన్స్ పేపర్‌ను గతంలో జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం వేర్వేరుగా నిర్వహించగా ఈసారి ఒకే ప్రశ్న పత్రంలో రెండు విభాగాలుగా విభజించి విడివిడిగా 12 పేజీలతో కూడిన బుక్‌లెట్లు ఇవ్వనున్నారు. జిల్లాలో 125 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 25, 411 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

ప్రశ్నా పత్రాలపై ఏడు అంకెలు కోడ్

పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎక్కడా పారపాట్లకు అవకాశం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గతంలో ఎప్పుడూలేని రీతిలో ఈసారి ప్రశ్నా పత్రాలపై ఏడు అంకెలతో కూడిన నంబర్లను ఏర్పాటు చేసింది. పేపర్ ఎక్కడైనా లీక్ అయితే, అది ఏ సెంటర్ నుంచి లీక్ అయ్యిందనే విషయాన్ని ఏడు అంకెల నంబర్ల ద్వారా సులభంగా గుర్తించవచ్చు. 15 ఏళ్లుగా అమలు చేస్తున్న బార్ కోడింగ్ పద్ధతిని ఈసారి కూడా అమలు చేస్తున్నారు. పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. అంత కంటే మించి రాస్తే అదనంగా 12 పేజీల బుక్‌లెట్ కూడా ఇస్తారు. గతంలో నాలుగు పేజీల ఆన్సర్ షీట్ మాత్రమే ఇచ్చి తర్వాత విద్యార్థులకు అవసరం మేరకు సమాధాన పత్రాలు అందించేవారు. ఇప్పుడు అలా కాకుండా ఇంటర్ తరహాలో బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే బుక్‌లెట్‌లు ఆయా పరీక్షా కేంద్రాలకు చేర్చారు.

గ్రేడ్ పాయింట్ల తొలగింపు: పదవ తరగతి పరీక్షల్లో గ్రేడ్ పాయింట్ల పద్ధతి మూలంగా అనర్థాలు ఎదురవుతుండడంతో ఆ విధానానికి ప్రభుత్వం ముగింపు పలికింది. వీటి ద్వారా విద్యార్థులు ఉన్నత విద్యలకు వెళ్లిన సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులను గమనించి స్వస్తి పలికింది. ట్రిపుల ఐటీల్లో సీట్ల కేటాయింపు సమయంలో ఇబ్బందులు తలెత్తేవి. గ్రేడ్ పాయింట్లు తొలగించడంతో విద్యార్థుల్లో పఠనా శక్తిలో మార్పులు వస్తాయని ప్రభుత్వం భావించింది. గతంలో ఉన్న పరీక్షా సమయం మూడు గంటలు ఉండగా ఈసారి అదనంగా 15 నిమిషాలు కేటాయించింది.

సత్ఫలితాలు వస్తాయి



టెన్త్ పరీక్షల విధానంలో ప్రభుత్వం చాలా మార్పులు తీసుకొచ్చింది. 11 పేపర్ల నుంచి ఆరు పేపర్లకు తీసుకురావడం చాలా మంచిది. విద్యార్థుల్లో ఒత్తిడి కూడ తగ్గుతుంది. వంద మార్కులకు పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గుతుంది. కొత్త పరీక్షా విధానంపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాం. కొత్త సంస్కరణలతో సత్ఫలితాలు వస్తాయి. – జిలానీ బాషా,ఎంఈఓ

మంత్రి బుగ్గన పర్యటన వాయిదా

డోన్: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి 29వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు డోన్ నియోజకవర్గంలో పర్యటించాల్సి ఉందని, అనివార్య కారణాలతో రద్దయినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మంత్రి బుగ్గన ఢిల్లీ పర్యటన ఉన్నందువల్ల తదుపరి పర్యటన కార్యక్రమాన్ని త్వరలో తెలియజేస్తామన్నారు.

31న వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు

కోవెలకుంట్ల: స్థానిక వీరభద్ర పంక్షన్ హాలులో ఈ నెల 31వ తేదీన మూడవ విడత వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహించనున్నామని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 655 పొదుపు గ్రూపులకు రూ. 3.74 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఆయా గ్రామాలకు చెందిన పొదుపు మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

31న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని ఈనెల 31 న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ. 25 వేలు, రూ. 15 వేలు, రూ. 8వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఈపోటీలలో పాల్గొన దలచిన వారు 30వ తేదీ సాయంత్రంలోగా రూ. 500 ఎంట్రీఫీజు చెల్లించాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీలు తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: పౌష్టికాహారంతో తల్లి, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఏసీ డీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో మంగళవారం నుంచి పోషణ పక్వాడ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఆకుకూరలు, కూరగాయలు తదితర పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు, వంటకాలను ప్రదర్శించారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఎస్ఐ మౌలానీ, ఈఓపీఆర్డీ రాధిక, వెలగటూరు, గుంజలపాడు, బిజనవేముల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సూపర్‌వైజర్లు గీతాలక్ష్మి, ప్రభావతమ్మ, శాంత, తదితరులు వంటకాల ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణపోషణ పథకం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాలతో కూడిన పౌష్టికాహారాని సరఫరా చేస్తోందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక రోటరీక్లబ్ భవనంలో మంగళవారం రోటరీ ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐడీసీ చైర్‌పర్సన్‌తోపాటు తహసీల్దార్ పుష్పకుమారి, ఎస్ఐ మౌలానీ, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రపై గేయం రచించి ప్రధాని మోదీతో ప్రశంసలందుకున్న విజయదుర్గను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితమనేది ఒకప్పటిమాటని, మారుతున్న కాలానికనుగుణంగా మహిళలు విద్య, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణిస్తూ ప్రసంశలందు కుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షురాలు పెండేకంటి సుమత, ఐఎస్ఓ వాసగిరి శోభారాణి, కార్యదర్శి దివ్య, కోశాధికారి లక్ష్మి, సభ్యులు విజయలక్ష్మి, గురుదేవి, యామిని, రాధ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వెలుగు చూసిన అక్రమాలు



బహిరంగ సభలో విచారణ చేస్తున్నఅధికారులు

ప్యాపిలి: మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీల్లో రూ. 22 కోట్లతో 2021–22లో చేపట్టిన ఉపాధి హామీ పథకం, పీఆర్, హౌసింగ్, ఎస్ఎస్ఏ, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో జరిగిన పనులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం బహిరంగ విచారణ నిర్వహించారు. ఆయా పనుల్లో అక్రమాలను గుర్తించిన అధికారులు బాధ్యుల నుంచి రూ. 28,89,959 రికవరీకి ఆదేశించారు. నంద్యాల జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఎంఅండ్‌డీ ఏపీడీ భాస్కర్ నాయుడు, వాటర్ షెడ్ అడిషనల్ పీడీ సలీంబాషా తదితరుల ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేశారు. సామాజిక తనిఖీ బృందం కొన్ని రోజులుగా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులతో పాటు పంచాయతీ రాజ్, ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో చేసిన పనులను తనిఖీ చేశారు. సామాజిక తనిఖీ బృందం సభ్యుల దృష్టికి వచ్చిన విషయాలను బహిరంగ విచారణలో అధికారుల ముందు వెల్లడించారు. మస్టర్లలో దిద్దివేతలు ఉండటం పట్ల జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మస్టర్ సక్రమంగా నిర్వహించకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాచర్ల గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులకు వీఆర్ఏ వెళ్లినట్లు గుర్తించారు. వీఆర్ఏతో ఉపాధి పనులు ఎలా చేపడతారని అధికారులు ప్రశ్నించారు. రికవరీకి ఆదేశించిన సొమ్మును 15 రోజుల్లో చెల్లించకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ ఫజుల్‌రహిమాన్, ఏపీడీ శ్రీవిద్య, ఏపీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం పటిష్ట అమలుకు తీర్మానం



మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్ : మున్సిపల్ సర్వసభ్య సమావేశం మంగళవారం చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన సాదాసీదాగా ముగిసింది. ముందుగా డోన్ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ శేగు అరుణ మృతికి కౌన్సిలర్లు, అధికారులు, కోఆప్షన్ సభ్యులు సంతాపం తెలియజేశారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు, బ్యాగుల నిషేధాన్ని పటిష్టంగా అమలుచేయాలని, ఫ్లెక్సీలపై నిషేధాన్ని కొనసాగించాలని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణంలోని ప్రతి వార్డు నందు మొక్కలను విరివిగా పెంచాలని సభ తీర్మానించింది. మౌలిక వసతుల కల్పనకు అదనపు నిధుల కోసంమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని సభ తీర్మానించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు కొత్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్, ఏఈ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి స్వగ్రామం యనకండ్ల అభివృద్ధికి రూ.16 కోట్లు వెచ్చించాం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: రాజకీయ పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే స్వగ్రామమైన యనకండ్లకు సంక్షేమ పథకాలు, అభివృద్ధికి దాదాపు రూ.16 కోట్లు వెచ్చించామని కాటసాని గుర్తు చేశారు. యనకండ్లలో రూ.16లక్షలతో నిర్మించిన సీసీ ఓపెన్ డ్రైవ్ విత్‌కవర్ స్లాబ్, రూ.8లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్, రూ.23. 80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.43లక్షలతో నిర్మించిన సచివాలయంతో పాటు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి తన తల్లిదండులు కోడూరు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీదేవిల జ్ఞాపకార్థం నిర్మించిన బస్ షెల్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే కాటసాని, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు బత్తులూరుపాడులో రూ.5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్మన్‌కు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేకించి యనకండ్ల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజలు, నాయకులు పూల వర్షం కురిపిస్తూ స్వాగతించారు. ఈ సందర్భంగా యనకండ్ల గ్రామ సచివాలయ ఆవరణలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్థన్‌రెడ్డి సొంత గ్రామం అయిన యనకండ్లలో కూడా ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. బీసీ అధికారంలో ఉండగా తాను ఎన్నికల ప్రచారం కోసం వస్తే అధికార బలంతో అడ్డుకున్నారని గుర్తు చేశారు. అధికార దుర్వినియోగం, పేదలను అవసరానికి వాడుకోవడం బీసీ నైజమని, తాను మాత్రం పార్టీలకు అతీతంగా యనకండ్ల గ్రామానికి సంక్షేమ పథకాలు అందజేశామని, అభివృద్ధి పనులు చేపట్టానని వివరించారు. యనకండ్ల గ్రామానికి చెందిన 160 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఈ గ్రామంలో ప్రభుత్వ భూమి లేనందున బనగానపల్లెలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో ఇంటి పట్టాలు పంపిణీకి తాను చర్యలు చేపడితే ఓర్వలేని బీసీ కోర్టు ద్వారా ఇళ్ల స్థలాల పంపిణీని నిలివేశారని గుర్తు చేశారు. బీసీ అధికారంలో ఉండగా మా సొంత గ్రామం అవుకు మండలం గుండ్లశింగవరం గ్రామానికి ఒక్క రూపాయను కూడా బీసీ మంజూరు చేయలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా యనకండ్ల గ్రామానికి, ప్రజలకు తనవతుగా మంచి చేశాని, మీ నుంచి లభించిన ఘన స్వాగతం అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇంకా యనకండ్ల గ్రామంలోని గంగమ్మ గుడి వద్ద కల్వర్ట్, చెరువు వద్దకు రస్తా, పెద్దమ్మ గుడి రస్తా, సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హామీ ఇచ్చారు.

శరవేగంగా రాష్ట్రాభివృద్ధి

- ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం శరవేగంగా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. పలు జాతీయ రహదారులు నిర్మించడం జరుగుతుందని, అలాగే ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన సమిట్ ద్వారా రాష్ట్రంలో రూ.3.50లక్షల కోట్లు పెట్టుబడులు పారిశ్రామిక వేత్తలు పెట్టడడం జరిగిందన్నారు. తద్వారా లక్షల మంది చదువుకున్న యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉండి ఉంటే, పరిశ్రమలకు రాయితీలు ఉండేవని, తద్వారా మరిన్ని పరిశ్రమలు మన రాష్ట్రానికి వచ్చేవన్నారు. అప్పటి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హోదా వద్దు, ప్యాకేజీ కావాల ని కేంద్రాన్ని కోరడం మూలంగా మనం ఎంతో నష్టపోతున్నట్లు ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అత్తార్‌జాహెద్, అబ్దుల్‌ఫైజ్ తదితర నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివ రామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్ రెడ్డి, ఏఈ సాయికృష్ణ, పీఆర్ ఏఈ రమణ, ఏఓ సుబ్బారెడ్డి, కాటసాని సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డి, ఎంపీపీ మానసవీణ, నాయకులు అంబటిరవి కుమార్ రెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, కోడూరు రాచంద్రారెడ్డి, కోడూరు వెంకట సుబ్బారెడ్డి, సాదుల శివశంకర్ రెడ్డి,మనోహర్‌రెడ్డి, బొబ్బల మహేశ్వరరెడ్డి,వడ్డె సుబ్బరాయుడు, సాంబ శివారెడ్డి, మదిలేటి గౌడ్, సంజీవ్‌గౌడ్, బొబ్బల రామ్మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, బి.నాగేంద్రరెడ్డి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, బుచ్చిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఈశ్వర్ నాయక్, నారాయణ, వెంకట్రామిరెడ్డి, బండిబ్రహ్మానందరెడ్డి, సురేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , చల్లా కుటుంబ సభ్యులు

అవుకు: ప్రతి అక్కా,చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం అవుకులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఆసరా ఉత్సవానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనమోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతగా అవుకు మండలంలోని 573 గ్రూపులకు సంబంధించిన 5,743 మంది మహిళలకు రూ.3.42 కోట్లను డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు అందించడం జరుగుతున్నదన్నారు. అమ్మ ఒడి, డ్వాక్రా రుణాలు మాఫీ, సున్నా వడ్డీ డబ్బులు, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యార్థుల చదువు సాగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. అనంతరం పొదుపు మహిళలకు చెక్కు పంపిణీ చేశారు. అదేవిధంగా పొదుపు మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, ఏపీఎం విజయగోపాల్, ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్ల రామిరెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, అయ్యపురెడ్డి, వల్లపురెడ్డి రామిరెడ్డి, లక్మా నాయక్, పురుషోత్తం, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక గ్రామంగా తీర్చిదిద్దుతాం

కొలిమిగుండ్ల: చింతలాయిపల్లెను స్నేహ పూర్వక గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సమత ఫౌండేషన్ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి అన్నారు. సేవా కార్యక్రమాలకు మరో ఏడాది పొడగించడంతో వాటికి సంబంధించి మంగళవారం గ్రామంలోని సమత కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గురివ్వరెడ్డితో కలిసి పోస్టర్‌లు విడుదల చేశారు.

'శ్మశాన వాటిక కబ్జా చేస్తున్నారు'

కొలిమిగుండ్ల: మండలంలోని ఉమ్మాయిపల్లె తండాలోని శ్మశాన వాటికను తండాకు చెందిన స్వామి నాయక్ కబ్జా చేస్తున్నారని షెడ్యూల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రామాంజులునాయక్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సర్వే నంబర్ 504/4లో కొన్నేళ్ల నుంచి శ్మశాన వాటికను ఉపయోగించుకుంటున్నారని చెప్పారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి

డోన్ టౌన్: స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటుకు పట్టణంలో స్థలం కేటాయిస్తూ అనుమతులు ఇవ్వాలని వివేకానంద సేవా సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు,అధ్యక్షులు, కార్యదర్శి మలిశెట్టి జగన్ మోహన్, సప్తశైల తిమ్మయ్య, నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసుల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, చైర్మన్ సప్తశైల రాజేష్‌కు వినతి పత్రాలు అందజేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బనగానపల్లెరూరల్: ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. మంగళ వారం మండలంలోని నందవరం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన స్టాఫ్ వివరాలు, ప్రజలకు అందిస్తున్న సర్వీస్ రిజిస్టర్, మెడిసిన్ స్టాక్ వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జునరెడ్డి, ఎంపీహెచ్ఓ విజయకుమార్,ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

బేతంచెర్ల: జగనన్న కాలనీల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలోని జగనన్న లేఔట్, బేతంచెర్ల పట్టణ సమీపాన కస్తూర్బా స్కూలు సమీపాన ఉన్న లే ఔట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఇసుక డంప్ యార్డును పరిశీలించిన ఆయన లబ్ధిదారులకు సక్రమంగా సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల: పది విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా సద్వినయోగం చేసుకోవాలని హెచ్ఎం హరికృష్ణ సూచించారు. పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్లో సరస్వతిపూజ నిర్వహించి 10వ తరగతి విద్యార్థులకు విడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలు రాసే విధానంపై హెచ్ఎం విద్యార్థులకు సూచనలు చేశారు.

పౌష్టికాహారం పంపిణీపై అవగాహన కల్పించాలి

ప్యాపిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న విషయం గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, సీడీపీఓ షంషాద్ బేగం అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.